'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఇరాన్ అధ్యక్షుని దుర్మరణం

ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంపై ప్రపంచవ్యాప్తంగా దిగ్భ్రాంతి వ్యక్తమైంది. ఆయనతో పాటుగా విదేశాంగమంత్రి, పలువురు ఇతర ఉన్నతాధికారులూ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. తూర్పు ప్రాంతంలో ఓ ఆనకట్ట ప్రారంభించేందుకు వెళ్లి తిరిగివస్తుండగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కూలిపోయింది. పశ్చిమాసియా వైషమ్యాల నేపథ్యంలో సహజంగానే ఈ ప్రమాదంపై రకరకాల ఊహాగానాలు వినవచ్చాయి. ఇజ్రాయెల్ రహస్య దాడిలో రైసీ మరణించారనేది ఒకటి. అమెరికాలో తయారైన బెల్ 212 హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఆంక్షల కారణంగా విడిభాగాల సరఫరా నిలిచిపోవడం ఈ ప్రమాదానికి దోహదం చేసి ఉండవచ్చనే వాదనలూ వచ్చాయి. ఇరాన్ ప్రభుత్వాధినేతల్లో రైసీ అత్యంత వివాదాస్పదుడు కావడం ఈ తరహా ఊహాగానాలకు కారణమని చెప్పాలి. అయితే ఇరాన్ మాత్రం గాలివాన బీభత్సం వల్లనే ప్రమాదం సంభవించినట్టు అధికారికంగా ప్రకటించింది.

మతాధికారిగా జీవితం ప్రారంభించి, న్యాయాధికారిగా అత్యున్నత స్థానానికి ఎదిగి, అంతిమంగా అధ్యక్ష పదవికి చేరుకున్న రైసీ మానవ హక్కులను ఉక్కుపాదంతో అణచివేసిన నాయకునిగా అపకీర్తి మూటగట్టుకున్నారు. ఆయన రాజకీయ జీవితంపై ప్రపంచవ్యాప్తంగా విమర్శనాత్మక కథనాలు వెలువడటమే ఇందుకు తార్కాణం. ఇరాన్ అతివాద నాయక శిబిరానికి చెందిన రైసీ దేశానికి సర్వాధికారిగా వ్యవహరించే మతనాయకుడు అలీ ఖామెనీకి అత్యంత సన్నిహితునిగా పేరున్నది. ఖామెనీ తదనంతరం ఆయన వారసునిగా అత్యున్నత పదవి చేపడతారనే ప్రచారమూ ఉంది. 1988లో ఇరాన్ జైళ్లల్లో మగ్గుతున్న వేలాది మంది రాజకీయ ఖైదీల ఊచకోతకు సూత్రధారిగా రైసీపై ఆరోపణలున్నాయి. ఈ కారణంగానే అమెరికా తదితర దేశాలు ఆయనపై ఆంక్షలు కూడా విధించాయి.

ఇరాన్ కుదుర్చుకున్న బహుళపక్ష అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడమే కాకుండా ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఆయన 2021లో దేశాధ్యక్ష పదవి చేపట్టారు. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కింద నలిగిపోతున్న ఇరాన్ ప్రజలు రైసీ మతఛాందస విధానాల వల్ల మరింతగా కష్టాల పాలయ్యారు. ముఖ్యంగా మహిళలు తీవ్రమైన అణచివేతను ఎదుర్కోవడంపై ప్రపంచవ్యాప్తంగా దుమారం చెలరేగింది. అంతర్జాతీయ విషయాలకు వస్తే బద్ధ శత్రువైన ఇజ్రాయెల్‌ను కట్టడి చేసేందుకు రైసీ తూర్పుదేశాల మైత్రికి ప్రాముఖ్యం ఇచ్చారు. అమెరికా నేతృత్వంలోని పశ్చిమదేశాలు ఇరాన్‌ను ఏకాకిని చేస్తే రష్యా, చైనాల వైపు మొగ్గారు. చిరకాల ప్రత్యర్థి సౌదీ అరేబియాతో చైనా మధ్యవర్తిత్వంలో సంధి కుదుర్చుకున్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు అన్నిరకాలుగా అండదండలు అందిస్తున్నారు. గాజా యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్‌తో వైరం తీవ్రతరమైంది. హెజ్బొల్లా, హమాస్, హౌతీ వంటి మిలిటెంట్ సంస్థల సాయంతో పరోక్ష యుద్ధం ధాటిని పెంచడం, సిరియాలో తమ దౌత్య కార్యాలయంపై దాడికి ప్రతీకారంగా ప్రత్యక్ష దాడికి తెగబడటం రైసీ హయాంలో కీలక ఘట్టాలుగా మిగిలిపోతాయి. అంతర్జాతీయ ఆంక్షల ఒత్తిడిని తట్టుకునేందుకు భారత్‌కు దగ్గరయ్యేందుకు రైసీ కృషిచేశారు. బ్రిక్స్, షాంఘై సహకార కూటమిలో చేరే విషయంలో భారత్ సహకారాన్ని తీసుకున్నారు. అంతర్జాతీయ సరుకుల రవాణాలో గొప్ప ముందంజగా భావిస్తున్న చాబహార్ రేవు ఒప్పందంపై రైసీ ముద్ర స్పష్టంగా ఉంది.

400 పార్ కాదు.. 400 హార్!

బీజేపీ నాయకుల ఉపన్యాసాలను మీరు విన్నారు కదా. వారు ఎక్కడికి వెళ్లినా పాత కథనే వల్లె వేస్తున్నారు. వాటిని వినడానికి ఎవరూ సిద్ధంగా లేదు. ఎన్డీయేను ఓడించాలని మా పీడీఏ (బ్యాక్‌వర్డ్, దళిత్, మైనారిటీ) కుటుంబాలు ఎప్పుడో నిర్ణయించుకున్నాయి. ఎన్నికలు మొదలైనప్పుడు '400 పార్' అని బీజేపీ నినాదం ఇచ్చింది. కానీ, ఇప్పుడు '400 హార్' అని ప్రజలు నినదిస్తున్నారు.

***- అఖిలేశ్ యాదవ్,** యూపీ మాజీ ముఖ్యమంత్రి*

దేశానికి దారిదీపం తెలంగాణ

అప్పుడే పదేండ్లు గడిచాయి. తెలంగాణ ఉద్యమం, తెలంగాణకు ఒక్క పైసా ఇవ్వను ఏం చేసుకుంటారో చేసుకోండి అని శాసనసభలో ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్ రెడ్డి సవాల్. తెలంగాణ వస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటాను. తెలంగాణ రానే రాదు చివరి బాల్ వేసి తెలంగాణను అడ్డుకుంటామని లగడపాటి సవాల్, పార్లమెంట్‌లో లగడపాటి పెప్పర్ స్ప్రే ప్రయోగించి తెలంగాణ ఏర్పాటును అడ్డుకోవడానికి చేసిన ప్రయత్నం మొన్న మొన్ననే జరిగినట్టు ఇంకా కండ్ల ముందు కదలాడుతున్నది. అనేక అడ్డంకులను తట్టుకొని ఆరు దశాబ్దాల కల సాకారమైంది. రానే రాదనుకొన్న తెలంగాణ ఏర్పడి పదేండ్లవుతున్నది.

బుద్దా మురళి

కాలచక్రంలో పదేండ్లు అనేది చాలా స్వల్పకాలమే కావచ్చు కానీ ఈ పదేండ్లలో తెలంగాణ స్వరూపం పూర్తిగా మారిపోయింది. రైతుల ఆత్మహత్యలు, కరువు, పేదరికంలో దేశంలో నంబర్ వన్ స్థాయి కోసం పోటీ పడిన ఉమ్మడి రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతం తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత దేశంలోనే అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా తలెత్తుకొని నిలబడింది. ఉమ్మడి రాష్ట్రంలో తరుచుగా తెలంగాణ జిల్లాలకు కరువు వార్తలు రాసేందుకు వచ్చేవారు. అదే జాతీయ మీడియాలో దేశంలో అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రం తెలంగాణ అనే వార్తలు చూసి ఎక్కడినుంచి ఎక్కడికి వచ్చాం అనిపించేది.

పరిశ్రమలకు, వ్యాపారులకు, ప్రజలకు కనీస అవసరాలు నిరంతర విద్యుత్తు, మంచినీళ్లు, మౌలిక సదుపాయాలు, మంచి రోడ్లు కావాలి. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేండ్ల పాలనాకాలంలో ఈ రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించాం. హైదరాబాద్ వంటి మహానగరంలోనే కాదు గ్రామాల్లో సైతం 24 గంటల పాటు విద్యుత్తు సరఫరా ఊహించని విజయం. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్తు చార్జీలు పెంచినప్పుడు రైతులు ఉద్యమించారు. ఉచిత విద్యుత్తు ఇస్తే విద్యుత్తు తీగలు బట్టలు ఆరేసుకోవడానికే పనికి వస్తాయని చంద్రబాబు చెప్పిన మాట ఆనాటి రాజకీయాల్లో బాగా పాపులర్. ఉమ్మడి రాష్ట్రంలో అతి కష్టమ్మీద ఏడు గంటల ఉచిత విద్యుత్తు అమలుచేస్తే తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా జరిగింది.

మిగిలిన రంగాల్లో అభివృద్ధి ఎలా ఉన్నా ఐటీరంగంపై చాలామందికి అనుమానాలుండేవి. తెలంగాణ ఏర్పాటును కోరుకున్నవారు, తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించినవారు ఇద్దరూ తెలంగాణ ఏర్పడితే ఐటీ రంగం భవిష్యత్తు ఏమిటి? అని సందేహించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఐటీ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందింది. 2014 నాటికి తెలంగాణలో ఐటీ ఎగుమతులు రూ.57,258 కోట్ల విలువ కాగా, 2022 నాటికే రూ.1,83,569 కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయి. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీలు ఎన్నో హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకున్నాయి. ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. ఒకవైపు కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టు మరోవైపు మిషన్ కాకతీయ పేరుతో చెరువుల పూడికతీత, చెరువుల్లో లక్షల కొద్దీ చేప పిల్లలను వేయడం, గొర్రెల పంపిణీ వంటి పథకాల వల్ల, రైతుబంధు వంటి పథకాల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మార్పు వచ్చింది.

తెలంగాణ తలసరి ఆదాయం 3,12,398 రూపాయలు. అదే జాతీయ తలసరి ఆదాయం 1 లక్ష 72 వేల, 776 రూపాయలు. జాతీయ తలసరి ఆదాయం కన్నా తెలంగాణ తలసరి ఆదాయం రెట్టింపు. అంటే పదేండ్లలో తెలంగాణ స్వరూపం, సామాన్యుడి జీవితంలో ఎలాంటి మార్పు జరిగిందో ఈ అంకెలే చెప్తున్నాయి. ఒకప్పుడు తెలుగు సినిమాల్లో తెలంగాణ అంటే రౌడీలు, పేదరికం, కరువు కాటకాలు, రైతుల ఆత్మహత్యలు అలా ఒక ముద్ర పడిన తెలంగాణ పదేండ్లలో తనను తాను పునర్నిర్మించుకొని దేశంలో అత్యధిక వరి పండించే రాష్ట్రంగా నిలిచింది. అత్యధిక ఐటీ ఎగుమతుల రాష్ట్రంగా, జాతీయ సగటు కన్నా రెట్టింపు తలసరి ఆదాయం గల రాష్ట్రంగా తెలంగాణ తలెత్తుకొని నిలిచింది. తెలుగు మీడియాలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రైతుల ఆత్మహత్యల వార్తలు ఆక్రమించుకొని ఉండేవి. అలాంటిది అత్యధిక వరి పండించడమే కాదు, హైదరాబాద్ నుంచి ఎటు వైపు వెళ్లినా వంద కిలోమీటర్ల వరకు వ్యవసాయ భూమి కోట్లలో పలుకుతున్నది.

జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం వైద్యరంగంలో విప్లవం లాంటిది. గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ కాలేజీల ఏర్పాటు పేదవారికి నాణ్యమైన విద్య లభించేందుకు దోహదం చేసింది. మునుగోడు ఉప ఎన్నికల సమయంలోయూ ట్యూబ్‌లో ఓ మహిళ మాట్లాడిన మాటలు గుండెలు పిండేసినట్టు అనిపించాయి. నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య చాలా తీవ్రంగా ఉండేది.

1993-94 ప్రాంతంలో గోపినాథ్ రెడ్డి అని జిల్లా ఎస్పీ ఉండేవారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీల తాగునీటి కోసం జీప్ ప్రతిరోజూ హైదరాబాద్ వచ్చేది. కేవలం తాగునీళ్లు తీసుకువెళ్లడానికి వచ్చేది. ఆ కాలంలో ఆ జిల్లాలో రిపోర్టర్‌గా పని చేయడం వల్ల ఈ విషయం తెలుసు. జిల్లా ఉన్నతాధికారులు జిల్లాల్లో మంచినీళ్లు కూడా తాగకపోయేవారు. ఫ్లోరోసిస్ అని భయపడేవారు. రిపోర్టర్‌గా ఈ విషయం తెలుసు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఆ ప్రాంతానికి చెందిన మహిళ చెప్పిన విషయం అసలు ఊహించలేక పోయాను. ఈ ప్రాంతానికి చెందినవారు పెళ్లి చేసుకున్నా పిల్లలు కనడానికి భయపడి దూరంగా ఉన్నాం. ఫ్లోరోసిస్ సమస్యతో పిల్లలు పుడతారేమో అనే భయంతో అని ఆ మహిళ చెప్పింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మిషన్ భగీరథ ద్వారా ఈ ప్రాంతాల్లో ఇప్పుడు సురక్షితమైన మంచినీరు లభిస్తున్నది. ఎన్నికల్లో కులం, మతం వంటివాటికి ప్రాధాన్యం లభించినప్పుడు ఫలితాలపై ఆ ప్రభావం ఉంటుంది. అయితే ఎన్నికల రాజకీయాలను పక్కనపెడితే తెలంగాణ పదేండ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించింది నిజం.

'ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ముందుగా ప్రకటించిన దాని ప్రకారం విద్యుత్తు కోత విధించేవారు. ఇది కాకుండా మధ్యమధ్యలో కరెంట్ కోత ఉండేది. ఇప్పుడు తలుచుకుంటేనే భయం వేస్తుంది. ఎలా వ్యాపారాలు చేశామా అనిపిస్తున్నది.' అని తెలంగాణ ఏర్పాటుకు ముందు తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేండ్లలో జరిగిన మార్పు గురించి సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో వ్యాపారి చెప్పిన మాట ఇది. క్రీస్తు శకం, క్రీస్తు పూర్వం అని కాలాన్ని విభజించినట్టు తెలంగాణ ఏర్పాటుకు ముందు తెలంగాణ ఏర్పాటు తర్వాత అని తెలంగాణ గురించి కాలాన్ని విభజించవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో విద్యుత్తు సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు అలానే కొనసాగాయి. దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలోని ఈ సమస్యలు మనకు వారసత్వంగా వచ్చాయి. ఒక ఏడాది పాటు ఇలానే విద్యుత్తు సమస్య ఉంటుంది. రెండవ ఏడాది నుంచి మనకు ఎంత విద్యుత్తు అవసరమో అంత సమకూర్చుకోగలం, మూడవ ఏడాది నుంచి మిగులు విద్యుత్తు ఉంటుందని సభలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రకటిస్తే నమ్మబుద్ధి కాలేదు. అప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కె.జానారెడ్డి మీరు చెప్పింది నిజమైతే మీ పార్టీ కోసం ప్రచారం చేస్తా అని సవాల్ చేశారు. జానారెడ్డి ప్రచారం చేయలేదు కానీ విద్యుత్తు రంగంలో అది నిజమైంది.

ఉమ్మడి రాష్ట్రంలో వారానికి రెండు మూడు రోజులు పరిశ్రమలకు పవర్ హాలీ డే ప్రకటించేవారు. పరిశ్రమల వారు ఇందిరాపార్క్ వద్ద ధర్నాలు చేసేవారు. అలాంటి చీకటిరోజుల నుంచి అడుగులు వేయడం మొదలుపెట్టిన తెలంగాణ పదేండ్ల ప్రయాణంలో ఇంటింటికి మంచి నీళ్లు, రైతుబంధు, కళ్యాణలక్ష్మి వంటి వాటిలో దేశానికి దారి చూపుతున్నది.

ఇది తెలంగాణ దశాబ్ది!

ఆరున్నర దశాబ్దాల పోరాటం..
మూడున్నర కోట్ల ప్రజల ఆకాంక్షలు..
వేల బలిదానాలు, త్యాగాలు..
బిగిసిన సబ్బండవర్గాల పిడికిళ్లు..
ఉద్యమ సేనాని అకుంఠిత, ఆమరణ దీక్ష..
ఉద్యమం విజయతీరాలకు చేరి
స్వరాష్ట్రం సాక్షాత్కారం అయ్యింది!

ఉద్యమ నాయకుడే ప్రజా పాలకుడిగా
స్వతంత్ర భారతదేశం ముందెన్నడూ చూడని
సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య అభివృద్ధి
నమూనా ఆవిష్కారం అయ్యింది!

పల్లె, పట్నం తేడా లేకుండా
ప్రగతిరథం పరుగులు తీసింది.
ఆహారధాన్యాల ఉత్పత్తి నుంచి
ఐటీ ఎగుమతుల దాకా
రికార్డులు బద్దలైనయి.

మీ అందరి మద్దతుతో
నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచినం.
నిరంతర కరెంటిచ్చి వెలుగులు నింపినం.
రైతన్నల, నేతన్నల, కష్టజీవుల
కలత తీర్చినం.. కడుపు నింపినం.

వృద్ధులకు ఆసరా అయినం..
ఆడబిడ్డలకు అండగా నిలిచినం.
సకల జనుల సంక్షేమానికి
తెలంగాణను చిరునామా చేసినం.

గుండెల నిండా జై తెలంగాణ
నినాదం నింపుకున్నం.
మన భాషకు పట్టం గట్టినం.
మన బతుకమ్మ, మన బోనం
సగర్వంగా తలకెత్తుకున్నం.
గంగా జమునా తెహజీబ్‌కు
సాక్షీభూతంగా నిలిచినం.

అవమానాలు
అవహేళనలు
ఎదుర్కొన్న గడ్డ మీదనే
తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని
అంబరమంత ఎత్తున ఎగరేసినం.

కేసీఆర్ పాలన సాక్షిగా
ఇది తెలంగాణ దశాబ్ది!
వెయ్యేండ్లయినా చెక్కు చెదరని పునాది!
జై తెలంగాణ!!

కల్వకుంట్ల తారకరామారావు
సిరిసిల్ల ఎమ్మెల్యే

(జూన్ 2, 2024 నాటికి తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి అవుతుంది)

మిస్టరీగానే రైసీ మరణం

నూతలపాటి రవికాంత్
97044 44108

**బలవంతుడ నాకేమని
పలువురతో నిగ్రహించి పలుకుట మేలా?
బలవంతమైన సర్పము
చలిచీమల చేతచిక్కి చావదె సుమతీ!**

వేల ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఇరాన్ ప్రపంచంలోని అతి పురాతన దేశాల్లో ఒకటి. క్రీ.పూ.550లో పర్షియా సామ్రాజ్యంగా మొదలై, క్రీ.శ.1501లో సఫావిడ్ రాజవంశం, 1794లో కజర్ రాజవంశం, 1925లో ఇరాన్ పహ్లవి రాజవంశాల కింద కొనసాగి.. 1979లో ఖామెనీ ఆధ్వర్యంలో ఇరానియన్ విప్లవం ద్వారా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఏర్పడింది. దీన్నే ఇరాన్ అని పిలుస్తారు. అయితే 1979 నుంచి మతపరమైన చట్టాలను అడ్డుపెట్టుకుని ఇరాన్ నేతలు మానవ హక్కుల్ని మంటగలిపారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ప్రపంచంలోనే ఎక్కువ ఉరిశిక్షలు అమలు చేసే దేశంగానూ ఇరాన్ రికార్డుల్లోకెక్కింది.

శాశ్వత సుప్రీం లీడర్ (జీవిత కాలం), ప్రజల ద్వారా ఎన్నికైన (4 ఏండ్లు) అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం నడుస్తుంది. న్యాయవ్యవస్థ అంతా ఇస్లాం షరియా చట్టం ఆధారంగానే ఉంటుంది. 1979 నుంచి ఇద్దరు శాశ్వత సుప్రీం లీడర్లుగా, 13 మంది అధ్యక్షులుగా కొనసాగారంటేనే ఆ దేశ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. తన సొంత మిలిటరీ (ఐఆర్‌జీసీ), గూఢచార సంస్థ (క్యూఎఫ్)లను ఉపయోగించి ఇరాన్ ఉగ్రవాద కార్యకలాపాలను నిర్వహిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. 1979 నుంచి ప్రపంచవ్యాప్తంగా తన ప్రధాన భాగస్వామి లెబనీస్ హెజ్బొల్లా ద్వారా 35కు పైగా దేశాల్లో హత్యలు, దాడులు చేయించినట్టు ఆరోపణలున్నాయి. 2012లో ఢిల్లీలో ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ-క్యూఎఫ్ సంస్థలు ఇజ్రాయెల్ దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఉగ్రవాద సంస్థలకు నగదు, ఆయుధాలను ఇరాన్ అందిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

ఇరాన్ 13వ అధ్యక్షుడైన రైసీ హెలీకాప్టర్ ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. 1960లో మషాద్‌లో జన్మించిన రైసీ.. ప్రాథమిక విద్యను మాత్రమే అభ్యసించారు. షరియా చట్టాన్ని కఠినంగా పాటించే ఆయన సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖామెనీ ఆశీర్వాదంతో అంచెలంచెలుగా ఎదిగారు. కరాజ్ జిల్లా అటార్నీగా, డిప్యూటీ ప్రాసిక్యూటర్‌గా పని చేసిన ఆయన 2021లో ఆ దేశ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అయితే ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి.

1988లో టెహ్రాన్ సమీపంలోని ఎవిన్, గోహర్దష్ట్ జైళ్లలో ఉన్న వేల మంది రాజకీయ అసమ్మతివాదులను రహస్యంగా, చట్టవిరుద్ధంగా ఉరితీసిన 'డెత్ కమిషన్'లో ఇబ్రహీం రైసీ ముఖ్య సభ్యుడు కావడం గమనార్హం. రైసీ అధ్యక్షుడయ్యాక ఇరాన్ ప్రజల అణచివేత ఎక్కువైంది. ఉరిశిక్షలు పెరిగాయి. ముఖ్యంగా రాజకీయ ప్రత్యర్థులు, అసమ్మతివాదుల అణచివేత తీవ్రతరమైంది. 2022లో మహిళలు, బాలబాలికలు సహా 582 మందికి మరణశిక్ష విధించినట్టు నివేదికలు తెలుపుతున్నాయి.

రైసీ అణచివేత ఎక్కువ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అలా క్రూరమైన హిజాబ్ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకే మహ్సా అమినీ అనే మహిళ పోలీసు కస్టడీలో మరణించారు. ఈ ఘటనను నిరసిస్తూ వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. దీనిపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి.

గాజా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో గాజాకు ఇరాన్ మద్దతుగా నిలుస్తున్నది. దీంతో రైసీ మృతిపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. హెలీకాప్టర్ ప్రమాదంలో ఇజ్రాయెల్‌కు చెందిన ఇంటెలిజెన్స్ సంస్థ మొసాద్ ప్రమేయం ఉండొచ్చని ప్రపంచం కోడై కూస్తున్నది. రైసీ ప్రయాణించిన హెలీకాప్టర్‌పై అత్యాధునిక స్పేస్ లేజర్ ఆయుధంతో దాడి జరిగి ఉండొచ్చని అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మొసాద్ ఏజెంటే అధ్యక్షుడి హెలీకాప్టర్ పైలట్‌గా వ్యవహరించారని పలువురు విశ్లేషకులు చెప్తున్నారు. అందుకే ఎస్కార్ట్ హెలీకాప్టర్లు సురక్షితంగా ల్యాండ్ అయ్యాయని, అధ్యక్షుడి హెలీకాప్టర్ ప్రమాదానికి గురైందని వారు వాదిస్తున్నారు. ఎవరి వాదన ఎలా ఉన్నా రైసీ మృతి మాత్రం మిస్టరీగా మారింది. ఏదేమైనప్పటికీ సుప్రీం లీడర్ కావాలనే కలను సాకారం చేసుకోకుండానే రైసీ మరణించారు.

(వ్యాసకర్త: సామాజిక, రాజకీయ విశ్లేషకులు)

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాల్సిన అవసరం ఉన్నది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తేనే పట్టభద్రులకు మేలు జరుగుతుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఈ నెల 27న జరగనున్న విషయం తెలిసిందే.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్సే గెలవాలె

గుండమల్ల సతీష్ కుమార్
94931 55522

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు పూర్తయ్యాయి. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన మీ కండ్ల ముందే ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలను తాము ఇచ్చినట్టు కాంగ్రెస్ చెప్పుకొంటున్నది. ఈ వాస్తవాన్ని విజ్ఞులైన పట్టభద్రులు గమనించాలి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే గ్రాడ్యుయేట్లు బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలి. బీఆర్ఎస్‌తోనే యువతకు మేలు జరుగుతుంది. ఉద్యోగుల భర్తీ కోసం కాంగ్రెస్ సర్కార్‌పై ఒత్తిడి తెచ్చేందుకు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి. శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక అవసరం. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడేందుకు పట్టభద్రుల ప్రతినిధిగా ఏనుగుల రాకేష్‌రెడ్డి ఉంటేనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారమవుతాయి.

నిరుద్యోగులకు, యువతకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యేలా రాష్ట్ర సర్కార్‌ను నిలదీసేందుకు పెద్దల సభలో ఎవరు ఉండాలనేది పట్టభద్రులే ఆలోచించుకోవాలి. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి అయితేనే మన సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుంది. అదే అధికార పార్టీ అభ్యర్థికో, మరొకరికో అవకాశం ఇస్తే మొదటికే మోసం వస్తుంది. ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలు, ప్రభుత్వం కార్యక్రమాలపై పొగడ్తలు తప్ప పనులు కావు. అందుకే ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకనే శాసనమండలికి పంపిద్దాం.

గత ఐదు నెలల కాంగ్రెస్ పాలన మన కండ్ల ముందుంది. విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు గత బీఆర్ఎస్ పాలనను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని ఒక్కసారి ఆలోచించండి. అన్నం ఉడికిందా లేదా అని తెలుసుకునేందుకు ఒక్క మెతుకును చూస్తే చాలు. అలాగే కాంగ్రెస్ పరిపాలన గురించి ఓ నిర్ణయానికి వచ్చేందుకు ఈ ఐదు నెలలు సరిపోతాయి. నీళ్లు లేక ఎండిపోయిన పంటలు, కరెంటు కోతలు, రైతుల ఆత్మహత్యలు, నేతన్న చావులు, ఆటో డ్రైవర్ల బలవన్మరణాలు ఇలా ఒక్కటా, రెండా ఎన్నో సమస్యలు మన తెలంగాణను మళ్లీ చుట్టుముట్టాయి. అమాయక ప్రజలను మోసం చేయవచ్చేమో కానీ విజ్ఞులైన విద్యావంతులను మోసం చేయలేరని నిరూపిద్దాం. చరిత్రలో నిలిచిపోయేలా తీర్పు ఇద్దాం.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికీ, ఎప్పటికీ తెలంగాణ పక్షపాతే. సంక్షేమ సారథే. ఆయన అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల బాగు కోసమే పరితపిస్తారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చేసిన బస్సుయాత్ర ద్వారా ఈ విషయం తెలంగాణ సమాజానికి స్పష్టమైంది. కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అనే విషయం అవగతమైంది. కేసీఆర్ ప్రశ్నించినందుకే రైతుబంధు ప్రక్రియ ముందుకుసాగింది. కేసీఆర్ ప్రశ్నించినందుకే నిలిచిపోయిన ఒక నెల పెన్షన్ వచ్చింది. కేసీఆర్ పర్యటించిన తెల్లారే ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. నీళ్లు అందాయి. ఆయన రోడ్డెక్కాకే వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతమయ్యాయి. 'వడ్లకు ఇస్తామన్న రూ.500 బోనస్ ఏమాయె' అని కేసీఆర్ గొంతెత్తిన తర్వాతే కాంగ్రెస్ సర్కార్ నోరు విప్పింది. సన్న వడ్లకే బోనస్ ఇస్తామని చెప్పి అసలు విషయాన్ని బయటపెట్టింది. లేదంటే ఇంకా సాగదీస్తూనే ఉండేది.

తాము ఏం చేసినా నడుస్తుందని కాంగ్రెస్ సర్కార్ అనుకుంటున్నది. అందుకే ఒక్క ఉద్యోగమైనా భర్తీ చేయకుండానే 30 వేల ఉద్యోగాలు ఇచ్చేశామని పట్టపగలే అబద్ధాలు చెప్తున్నది. ఈ నేపథ్యంలో పట్టభద్రులు మేలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తమను మళ్లీ మళ్లీ మోసం చేయలేరని చాటిచెప్పాల్సిన ఆవశ్యకత ఉన్నది.

(వ్యాసకర్త: బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి)